క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన మల్యాల ఎస్సై



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై అశోక్

మల్యాల : మండల ఎస్సైగా బుగ్గారం నుంచి బదిలీపై వచ్చిన తీగల అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రముఖులు ఎస్సై అశోక్‌ను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందు ఎస్సైగా విధులు నిర్వర్తించి, మేడిపల్లికి బదిలీపై వెళ్లిన చిరంజీవికి పలువురు వీడ్కోలు పలికారు.

'బీసీ బంధు ప్రకటించాలి'

ఇబ్రహీంపట్నం : బీసీలకు బీసీ బంధు ప్రకటించాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుప్పెం మహేందర్ డిమాండ్ చేశారు. ఎంతోమంది బీసీలు వెనుకబడి ఉన్నారని, సీఎం కేసీఆర్ బీసీ బంధు ప్రకటిస్తే జీవనోపాధి పొందుతారన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మురళిగౌడ్

వెల్గటూర్ : కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మురళిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జూన్ 8 వరకు గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారని, 18 సంవత్సరాలు పైబడిన వారంతా కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాగోజీపేటలో..

కథలాపూర్: బీమారం మండలం రాగోజీపేటలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. వారం రోజులపాటు గ్రామంలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వనజ, సర్పంచ్ లహరిక, హెల్త్ సూపర్‌వైజర్ పద్మావతి, లక్ష్మీరాజం, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ నాగరాజు

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వలస కూలీ జబ్బార్ మృతిచెందగా బాధిత కుటుంబానికి సర్పంచ్ వంతడుపుల నాగరాజు గురువారం రూ.5వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో వలసకూలీ జబ్బార్, యువకుడు సురేశ్ మృతి చెందడం బాధాకరమన్నారు. ఇక్కడ నాయకులు, తదితరులున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్: మండలంలోని భూపతిపూర్, బోర్నపల్లి గ్రామాల్లోని పలు కులసంఘాల ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న కైర నాగేశ్

మల్లాపూర్ : మండల కేంద్రానికి చెందిన విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేశ్ గురువారం రక్తదానం చేశారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన మహిళకు అత్యవసరంగా రక్తం కావాలని సామాజిక మాధ్యమంలో తెలుపగా, స్పందించిన కైర నాగేశ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి కమిటీలు.. నామమాత్రం

- బాధ్యతలు లేనప్పుడు ఎందుకు నియమించారని అధికారులను ప్రశ్నిస్తున్న కమిటీ సభ్యులు
- అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసేందుకు ఐదేళ్ల కిందట ఏర్పాటు



అరవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

పెగడపల్లి: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి సక్రమంగా, సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీల పాత్ర నామమాత్రంగా తయారైంది. తమకు ఎలాంటి బాధ్యతలు లేనప్పుడు ఎందుకు నియమించారని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేపడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అభివృద్ధి పనులు జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లేందుకు అప్పట్లో పంచాయతీల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. అయితే ఈ కమిటీలను ఏర్పాటు చేసినప్పటి నుంచి నేటి వరకు కాగితాలకే పరిమితమయ్యాయి. గ్రామాలను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుంచాలని ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. కమిటీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ర్యాంకు సాధించే అవకాశముంటుంది. ఈ దిశగా గ్రామాల్లో కమిటీలు పనిచేసేలా అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. మండలవ్యాప్తంగా 23 పంచాయతీల్లో కమిటీలు ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీలో 15 మంది చొప్పున సభ్యులున్నారు. పల్లె ప్రగతి పేరుతో ప్రభుత్వం ఐదేళ్ల క్రితం పంచాయతీల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ నిధుల వ్యయంలో వీటి పాత్రకీలకం. సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్ల మేరకు కమిటీల్లో సభ్యులను నియమించారు. అధ్యక్ష హోదాలో సర్పంచ్, కార్యదర్శి ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు సభ్యులుగా నియమించారు. ఇందులో పంచాయతీ పారిశుద్య కమిటీ, తాగునీటి సరఫరా, రైతు కమిటీ, పాఠశాల అభివృద్ధి కమిటీ, గ్రామాభివృద్ధి పనుల కమిటీ, వీధిదీపాల నిర్వహణ, మద్య నిషేధ అమలు, తదితర మరో మూడు కమిటీలు ఉన్నాయి. కమిటీల ప్రాధాన్యం లేకపోవడంతో కాగితాలకే పరిమితమయ్యాయి.

అమలు కాని కమిటీల సూచనలు..

ప్రజాప్రతినిధులు, అధికారులను సమనయ్వం చేస్తూ పనులను ప్రాధాన్య క్రమంలో నిర్వహించేందుకు కృషిచేయాలి. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన కమిటీలు అభివృద్ధి పనులు చేయించేందుకు సమన్వయంతో పనిచేయాలి. వీధిదీపాలు వెలగని చోట కమిటీ పరిశీలించి వెలిగేలా చూడాలి. ఏ వీధిలో తాగునీటి కుళాయిలు రాకపోతే అక్కడ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి. పంచాయతీ సమావేశాలు, నిధుల వినియోగం, ఇతర పనుల్లో వీటి ప్రాధాన్యం లేకపోవడంతో ఉత్తుత్తి కమిటీలుగా మారాయి. కమిటీల సూచనలు ఎక్కడా అమలు కావడం లేదు. సలహాలు, సూచనలు పంచాయతీ పాలకులు బేఖాతరు చేయడంతో అవి నిర్వీర్యంగా మారాయన్న ఆరోపణలున్నాయి.

అవగాహన కల్పిస్తాం



పంచాయతీల్లో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీల పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. కమిటీల పని తీరుపై మరోసారి అన్ని పంచాయతీల్లో అవగాహన కల్పిస్తాం. మండలంలోని కొన్ని పంచాయతీల్లో కమిటీలు పనిచేస్తున్నాయి. అన్ని జీపీల్లో కమిటీలు చురుగ్గా పాల్గొనేలా చూస్తాం.

– పుల్లయ్య, ఎంపీడీవో

ఎంసెట్ ఫలితాల్లో 'అల్ఫోర్స్' సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

జగిత్యాల: ఎంసెట్ ఫలితాల్లో జగిత్యాల అల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో విశ్వనాథ్ వేణుగోపాల్ 1157, తుమ్మనపల్లి స్ఫూర్తి 2639, గిరి వినీత 3098, అన్విత్‌సాయి 3813, శ్రీముఖి 6250, మెడికల్ విభాగంలో క్యాస స్ఫూర్తి 5971 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించారు.

పీఆర్‌బీఎం విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల : పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మెడిసిన్ విభాగంలో గోనె శ్రీదేవి 4517 ర్యాంకు, ఇంజినీరింగ్ విభాగంలో ఇందూరి విజయశ్రీ 14247 ర్యాంకు, సబూహ తైబు 16838, ఎండీ సంయొద్దీన్ 19073, అభి సాత్విక 21212 ర్యాంకు సాధించారు. 12 మంది విద్యార్థులు 25 వేల లోపు ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు, ఉపన్యాసకులు అభినందించారు.

'మాస్త్రో' విద్యార్థులు..

కోరుట్ల: ఎంసెట్ ఫలితాల్లో పట్టణంలోని మాస్త్రో జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో రాగిని శ్రీ హర్షిణి 13890 ర్యాంకు, మల్యాల కీర్తిప్రియ 18011 ర్యాంకు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో తిరుక్కోవెల ప్రకృతి 15522 ర్యాంకు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

భారత్‌లోనే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పటిష్టం



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్

సారంగాపూర్: ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతదేశంలోనే బలంగా ఉందని, దీనిని ఇలానే కొనసాగించాలని తెలంగాణ ప్రాంత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, భారత సంస్కృతి, సంప్రదాయాలపై సుదీర్ఘంగా ఆయన వివరించారు. మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ సమాజ వికాసంలో ప్రధాన పాత్ర పోషిస్తోందని అన్నారు. ఉమ్మడి కుటుంబాలపై ఒకరి నుంచి ఒకరు ప్రేరణ పొందుతూ ఈ వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో వొద్దిపర్తి మధుకుమారాచార్యులు, వెంకటరమణారెడ్డి, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

వైద్యం అందేనా ?

- స్థానికంగా వైద్యులు ఉండడం లేదని ఆరోపణలు
- 42 పోస్టులు మంజూరు



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

జగిత్యాల : జగిత్యాలకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి జనరల్ ఆస్పత్రిగా మారింది. దీంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని ఆశిస్తున్నారు. తాజాగా మళ్లీ వైద్యుల పోస్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 42 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు జగిత్యాలలో 19 మంది జాయిన్ అయ్యారు. జనరల్ ఆస్పత్రిగా ఏర్పడినప్పుడు మొత్తం 35 మంది ఉండగా, ఇందులో 11 మంది ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరితోపాటు సీనియర్ రెసిడెన్సీలు 38 మంది ఉన్నారు.

అందుబాటులో ఉండని వైద్యులు

ఇంతమంది వైద్యులు వస్తున్నా పట్టణంలో స్థానికంగా ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బయోమెట్రిక్ విధానం లేకపోవడం, ఇష్టానుసారంగా వస్తూపోతున్నారని ఆరోపణలున్నాయి. వందల సంఖ్యలో అన్ని విభాగాల్లో వైద్యులు ఉన్నా ఆశించిన మేర వైద్యం అందడం లేదని తెలుస్తోంది. వంద పడకల ఆస్పత్రి నుంచి 300 పడకల జనరల్ ఆస్పత్రికి పెరిగినప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. తాజాగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి 42 మంది కొత్త వైద్యులను కేటాయించారు. ఇందులో 17 విభాగాలు మెడిసిన్, సర్జరీ, ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, అటానమీ, బయోకెమిస్ట్రీ, ఫల్మానాలజీ, డెంటల్, ఈఎన్టీ, ఎమర్జెన్సీ మెడిసిన్ ఇలా అన్ని విభాగాల్లో వైద్యులున్నారు. కొత్తగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉండే విధంగా గుండెకు సంబంధించి, న్యూరాలజిస్ట్, కిడ్నీకి సంబంధించిన వైద్యులు సైతం వచ్చారు. ప్రస్తుతం ఇంతమంది వైద్యులున్నా వార్డుబాయిలే కుట్లు వేయడం, డ్యూటీ డాక్టర్లు ఉండకపోవడం జరుగుతుంది.

బయోమెట్రిక్ అమలయ్యేనా ?

జూన్ 1 నుంచి బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు వైద్యులు పేర్కొన్నారు. గతంలో సైతం బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేసినా క్రమంగా పనిచేయలేదు. దీంతో మ్యానువల్ పద్ధతిలోనే ఏర్పాటు చేశారు. అయితే వైద్యులు సమయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రిలో ఎంత మంది పని చేస్తున్నారు, ఎంత మంది డాక్టర్లు వచ్చారన్నది ఎవరికీ అర్థం కావడం లేదు.

పక్కాగా అమలు చేస్తాం

జూన్ 1 నుంచి బయోమెట్రిక్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తాం. తాజాగా వివిధ విభాగాలకు చెందిన 42 మంది వైద్యుల పోస్టులు మంజూరయ్యాయి. 19 మంది వైద్యులు జాయిన్ అయ్యారు.

– రాములు, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు 'మౌంట్ కార్మెల్' విద్యార్థులు

జగిత్యాల రూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలోని మౌంట్ కార్మెల్ పాఠశాలకు చెందిన కొక్కు మణికంఠ, తేజస్ ప్రజ్వల్ బాస్కెట్‌బాల్ అండర్ 16 విభాగంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీలు సామంత్, మంగ, విజ్ఞ తెలిపారు. ఈనెల 25 నుంచి 26 వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, కరస్పాండెంట్ సిస్టర్ జ్యోస్మితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రజలను కలుస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ

- మూడు గ్రామాల్లో ఎమ్మెల్యే సంజయ్ పర్యటన



కండ్లపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్/జగిత్యాల: ప్రజలను కలుస్తూ.. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరిస్తూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం బీర్‌పూర్ మండలంలోని మూడు గ్రామాల్లో పర్యటించారు. మీరు నేను కార్యక్రమంలో భాగంగా కండ్లపల్లిలో బుధవారం రాత్రి అక్కడే బస చేసి పల్లె నిద్ర చేశారు. ఉదయం కండ్లపల్లి, రంగసాగర్, చెర్లపల్లి గ్రామాల్లోని వార్డుల వారీగా పర్యటించారు. పోడు భూములకు పట్టాలిచ్చే విధంగా చూడాలని, ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు దరఖాస్తులు అందజేశారు. చర్లపల్లిలో రూ. 59 లక్షలతో ఏర్పాటు చేస్తున్న కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఇద్దరికి సీఎం సహాయనిధి రూ.40 వేలు, మరో ముగ్గురికి కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాం చందర్ రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొల్ముల రమణ, ముక్క శంకర్, ఆయా గ్రామాల సర్పంచులు పర్వతం రవి, అజ్మీరా ప్రభాకర్, బోడ స్వప్న, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు నారపాక రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థలం లేకపోవడంతో ఇబ్బందులున్నాయని, ఉందని, వెంటనే భవనానికి స్థలం కేటాయించాలని కోరగా కేటాయించేలా చూస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అధ్యక్షుడు వెంకటస్వామి, ఐలయ్య, ఉపాధ్యక్షుడు గోపి, రమేశ్, రాములు, కోశాధికారి మల్లేశ్, హన్మంతరెడ్డి ఉన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పన్నాల తిరుపతి రెడ్డి

- బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి

రాయికల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ రాజనాల మధుకుమార్, భూపతిపూర్ సింగిల్‌విండో చైర్మన్ ముత్యంరెడ్డి, పట్టణ దళితమోర్చా అధ్యక్షుడు సంజీవ్, నాయకులు మల్లారెడ్డి, సామల సతీశ్, ఏలేటి జలేందర్, నాయకులు రాజశేఖర్, సాయిరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోరుట్ల రూరల్ : మండలంలోని పైడిమడుగు ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు, గురువారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు.. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు బెజ్జారపు వేణు గోపాల్, రవి, శంకర్, గంగాధర్, పూర్వ విద్యార్థులు రమేశ్, సందీప్, హరీశ్, జగదీశ్వర్, రఘుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ శహర్‌కు సహకరించాలి



నాలుగో వార్డులో వస్తువులను సేకరిస్తున్న చైర్మన్, కమిషనర్

- మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు

రాయికల్: పట్టణంలోని నాలుగో వార్డులో స్వచ్ఛ శహర్ కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. గురువారం నాలుగో వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంట్లోని పాత దుస్తులు, పుస్తకాలు, పేపర్లు, ప్లాస్టిక్ పదార్థాలను సంబంధిత మున్సిపల్ అధికారులకు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- వేగవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం : ఇంకుడుగుంతల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రభు అన్నారు గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.